# ఏరు పొంగింది

"ఏరు పొంగింది. కట్టున్న వొంతెన కూలి పోయింది. వొంతెనమీద పన్జేస్తున్న నీ శీనయ్య ఏట్లో కొట్టుకుపోయాడే లచ్చిమి తల్లీ. నీ బతుకు ఏట్లో కలసి పోయిందే మా తల్లీ" అంటూ ఆ రోజున దోనెతాత అరిచిన అరుపు, ఈ రోజున కూడా గుండెల్లో ఫిరంగి పేల్చినట్టు ఉండుండి జ్ఞాపకం వస్తూనే ఉంటుంది లచ్చికి. పధ్నాలు గేళ్ళ కిర్తం, అంటే రంగి తన కడుపునబడ్డ ఆరునెల్లకి. తన బతుకు అలా బండలై పోయింది. శీనయ్యని మనువాడి నందుకు కులంవోళ్ళంతా తనని వెలేశారు. అందుకే ఏటివత లికి వచ్చి, తనూ శీనయ్యా కాపురం పెట్టారు. తమలాంటి ఇంకో అయిదారు జంటలే ఆ చుట్టువక్కల పాకల్లో ఉంటు న్నారు తమందరికీ పెద్ద దిక్కుగా ఉంటూ అవసరం అయినప్పుడు ధైర్యం చెబుతూ మంచికి చెడుకి ఆదుకుంటూ, ఆ దోనె తాత ఉన్నాడు కనుక కానీ, లేకపోతే ఊరు వెలేసి నందుకు, ఏటివతల కాపురం పెట్టినందుకు, తనూ, శీనయ్యా ఎన్ని అవస్థలు పడవలసి వచ్చేదో.

కొత్త మురిపెం తీరకుండానే, పెళ్ళయిన ఏణ్ణర్థానికే శీనయ్య తననలా అన్యాయం చేసినందుకు దోనెతాత ఆదు కుని తనకో బతుకుతెరువు చూపించి పుట్టబోయే రంగిమీద

ఆశలు కల్పించి చావకుండా తనని ఆపాడు కానీ, లేకపోతే ఆ రోజే శీనయ్యతోపాటు ఏట్లో కలిసిపోయేదే - తన పాక చుట్టూ కాయగూరల చెట్లూ, మల్లెతీగలూ వేయించి, అవి పట్టికెళ్ళి ఊళ్ళో అమ్ముకొచ్చి బతికేలా ఏర్పాటు చేశాడు దోనెతాత. ఆరోజున అతనలా చేశాడు కనకే ఇవాళ తనూ, రంగీ ఇన్ని గంజినీళ్ళు తాగ గలుగుతున్నారు.

ఏవిటో, ఈ రంగికి ఉన్నట్టుండి ఒక్కొక్క రోజున, తిక్కపుడుతూ ఉంటుంది. లేకపోతే ఇవాళ కూరగాయలు అమ్ముకురానని మొండిపట్టు పట్టి, అలా కిరికి ఆడుకుంటూ కూర్చోవడం ఏవిటి?

మిసమిసలాడుతూ, పూలగంపలా కలకల నవ్వుతూ, తనతోటి ఆడపిల్లలతో కిరికి ఆడుతున్న రంగిని కళ్ళకి నిండుగా చూచుకుంటూ. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ, రంగి పట్టికెళ్ళనని ఉంచేసిన కూరగాయల బుట్టని పక్కని బెట్టుకొని, దిగాలుగా కూచుంది లచ్చి. ఆట మధ్యలో యాదాలాపంగా అటుచూసిన రంగికి, దీనంగా కూచున్న అమ్మ కళ్ళల్లో మొత్తం ప్రపంచంలోని వేదనా, బాధా, అంతా రూపు కట్టినట్లు కనిపించాయి.

వెంటనే తన చేతిలో ఉన్న బిళ్ళని కిందపడేసి 'అందాకా నా ఆట ఎవరేనా ఆడుతూ ఉండండర్రా. నేనిప్పుడే ఊళ్ళోకెళ్ళి కూరలమ్ముకుని వొచ్చేస్తాను. ఎవళ్ళాడతారో నా ఆట. పాడుజేసినా ఓడిపోయినా జాగ్రత్త. నెగ్గించా

ల్సిందే' అంటూ తోటి స్నేహితురాళ్ళని హెచ్చరించి దగ్గర్లో పాకవారని కూర్చున్న తల్లి దగ్గిరికి పరుగుతీసింది రంగి.

నేను కూరలమ్ముకుని వచ్చే తలికి, నువ్వు కూడు ఒండాల! గంజి నీళ్ళోసి నంజుకోడానికి మిరపకాయేస్తే కాదు. ఇయ్యాల కూర వొండాల. ఆఁ!" అంటూ గంపనెత్తి నెట్టుకుని లేడి పిల్లలా ఛెంగున ఎగిరి వెళ్తూన్న కూతుర్ని చూసి నవ్వుకుంది లచ్చి. "ఇంత చిలిపి పిల్ల. దీని ముద్దూ మురిపెం చూసుకోవడానికి తన దేవుడులేడుకదా! దోనెతాత చెప్పినట్లు దీన్ని వాళ్ళ మనవడు రంగడి చేతిలో పెట్టేస్తే ఇంక తను ఏమైనా బెంగలేదు. ఆ రోజే ఇంకా రావడం లేదు. రంగంనుంచి ఆ రంగడు ఎప్పుడొస్తాడో ఏమో' అను కుంటూ కళ్ళు ఒత్తుకుంటూ పాకలోకి వెళ్ళి పోయింది లచ్చి.

కూరలగంపతోసహా గట్టుమీంచి దోనెలోకి ఒక్కగెంతు గెంతిన రంగిని చూసి "ఏంటే పిల్లా అంత ఇసురుగా ఉన్నావు. ఇయ్యాల ఈ దూకుడేంటి?" అంటూ పలకరించాడు దోనెతాత. ఉగిపోతున్న దోనెకి గెడ ఆన్చి దాన్ని కదలకుండా నొక్కి పట్టడానికి సతమతమవుతూ.

మరిలేకపోతే ఏంటి తాతా! తోటి అమ్మాయిలతోటి ఒక్క గంట ఆడుకోనియ్యడు. ఊసులు చెప్పుకోనియ్యడు. కూరలు అమ్ముకురా, మల్లెపూలమ్ముకురా అంటూపొద్దున్నా

సాయంత్రం, నసపెట్టేస్తది. ఏమైనా నేనింక దోనెదాటి ఎల్లడం, ఊళ్ళో ఇయన్నీ అమ్మడం సెయ్యను బాబు అంది రంగి బుంగమూతి పెడుతూ.

"మరేటి సేత్తావే? కూసుని ఆడుకుంటావా?" అన్నాడు తాత, దోనెని అవతలకి దాటిస్తూ. రంగి ఏం సమాధానం చెప్పలేదు. ఉండుండి నీటిలో ఎగురుతూన్న చేపపిల్లల కేసి తమాషాగా చూస్తూ కూచుంది.

ఆడుదుగాని.... ఆడుదుగాని.... రంగంనుంచి రంగ డొచ్చి నీ చెవి మెలిపెడ్తేకాని నీ ఆగడం తగ్గదు."

"నీ మనవణ్ణి నేనేం చేసుకోను" ఈ మాటలు అంటున్నప్పుడు రంగి బుగ్గలు ఎర్రబడ్డాయి.

ఆc! ... ఇలా అన్నవోళ్ళే - ఆనక బుద్ధిగా కూసుని మెళ్ళో తాళి కట్టించుకుంటారు." ఇలా ఓ పక్కనుంచి దొనె తాత పరాచికం ఆడుతూనే ఉన్నాడు, అవతల గట్టువచ్చి, గట్టుమీదికి ఒక్క గెంతుగెంతి రంగి తుర్రుమంది. తాత నవ్వుకున్నాడు....

"నాలుగు రోజులదాకా నువ్వు ఊళ్ళో కూరలూ గట్రా అమ్మడానికి ఎల్లకూడదు. ఇదిగో నా చీరకొంగు చింపి ఇస్తున్నాను గాని ఇది పైటేసుకుని ఈ మూడు రోజులూ ఆ మూల కూసో." అని అచ్చి అన్నప్పుడు రంగికి భలే కోపం వచ్చింది. మర్నాడు ఏదో తిక్క పేచీ పెట్టి కాళ్లు నేలకేసి

బాదుకొంది. "ఇంకోరోజున నేను కూడు తినను నాకు ఏటో లాగుంది" అంటూ సీ వెండి మట్టుగిన్నెలో ఉన్న అన్నం పక్కకి లాగేసింది." నేనెన్నాళ్ళే ఇలా కూసోవడం? పోయి ఆళ్ళతో కలిసి ఆడుకుంటాను" అంటూ మరోనాడు పేచీ పెట్టింది.

"ఏమిటే రంగీ పేచీ పెడుతున్నావు?" అని అడిగిన దోనెతాతమీదికి అంత ఎత్తునలేచి "ఏటే తాతా! ఈ వాడలో ఎవరి పాకలో ఏం గొడవైనా నువ్వే తగువు తీర్చటానికి తయారౌతావు? ఇక మీదట మా పాక కాడికి రామాక" అంటూ అరిచింది.

"ఒయసు వచ్చే రోజుల్లో పిల్లలంతా ఇలాగే తిక్క పేచీలు పెడతా ఉంటారులే, లచ్చీ నువ్వేం దిగులుపడమాక. వొచ్చే అమాసనాటికి రంగంనుంచి రంగడు వొచ్చేస్తాడు. మూడుముళ్ళూ పడ్డాయంటే అమ్మాయి ఆగడం ఎక్కడిదక్కడ పోతుంది" అంటూ దోనెతాత ముందుకి నడిచాడు.

"రంగడు వొస్తాడు. అమాసనాడు వొస్తాడు అనడమే కాని, ఆ అమాస ఇప్పట్లో వొచ్చేలాగ కనిపించడంలేదు" రంగికి. "ఎన్ని రోజు లెళ్ళినా అమాస రాదేటి?" అనుకుంది ఓరోజున చెక్క అద్దంలో చూసుకొని చుక్కబొట్టు దిద్దుకుంటూ. వెనుకనుంచి వచ్చి కూతురు చేసుకుంటూన్న ముస్తాబు చూసి మురిసిపోయి" అదెప్పుడు కొన్నావే? మన

లాంటోళ్ళకి సెక్కద్దాలెందుకు" అంది లచ్చి బుగ్గలు నొక్కుకుంటూ.

"నీ కెందుకు అవన్నీ, మల్లెపూలు కోశావా? గంప ఇలా ఇయ్యి అమ్ముకొస్తా" అంది రంగి చెక్కద్దంతీసి తాటాకు పెట్టెలో దాచి, తలంటుకొన్న జుట్టు ముడిపెట్టుకుంటూ ఎత్తుగా ఏపుగా పువ్వుల రథంలా ఉన్న కూతురు తలమీద పూలగంప పెడుతూ' రంగీ, నువ్వు మునుపటిలా సిన్నపిల్లవి కాదు. జాగ్రత్తగా పువ్వులమ్ముకుని సీకటడకుండా వొచ్చేస్తూ ఉండు. ఎవరితోటీ మునపటిలా నవ్వుతూ మాట్లాడకు, మనుషులు మంచోళ్ళయినా మనస్సులు సెదురుతాయి" అంది లచ్చి బరువుగా గాలి వొదులుతూ.

"పిచ్చిది అమ్మ ఏంటిలా కొత్తగా చెబుతుంది ఇయాల" అనుకుంటూ, అలాగే అని బుర్ర ఊపి. మల్లె పువ్వుల గంప నెత్తి నెట్టుకొని బయలుదేరింది రంగి. అవతల గట్టున ఉన్న ఊళ్ళో ఆ పువ్వులు అమ్మి ఆ డబ్బుతో ప్రాణం నిలుపుకోడానికి కావలసిన బియ్యం ఉప్పు కొని తెచ్చుకొనే ఉద్దేశంతో.

దోనె దాటిస్తున్నప్పుడు తాత "పెందరాళేరాయే రంగీ! ఇయ్యాలే రంగడొచ్చేది" అన్నాడు. ఆ మాటలు విన్నప్పుడు రంగికి వళ్ళంతా ఝల్లుమంది. గుండెలు బరువెక్కి తడబడుతూ ఊళ్ళోకి వెళ్ళింది. "మల్లెపూలు" అని అరుస్తున్నప్పుడు తన కంఠం తనకే కొత్తగా చిత్రంగా వినిపించింది.

ఏదో ఉత్సాహం - ఉద్రేకం - పట్టలేని ఆనందం. ఇదీ అని చెప్పలేని సంతోషం. గాలిలోకి అలా అలా ఎగిరి పోవాలనీ, ఏవో పాటలు పాడెయ్యాలనీ మనస్సు ఉరకలు వేస్తోంది. ఈ పువ్వులన్నీ ఎంత చప్పుని అమ్మేసి ఎంత చప్పుని ఇంటికి వెళ్ళి పోదామా అని ఏక తొందర. అందుకే గట్టిగా అరుస్తూ, చురుగ్గా వీధులన్నీ తిరుగుతూ, అమ్మ సాగింది రంగి.

ఒక మేడమీంచి తెల్లని పొడపైన అందమైన యువతి "ఇలా రా" అంటూ చేతిలో సంజ్ఞచేస్తూ పిలిచింది. ఆవిడ తరుచు తన దగ్గర పువ్వులు కొంటూ ఉంటుంది. అదే తనకి అర్థంకాదు, ఆవిడకి పువ్వులు కరువా అంటే ఇంటి నిండా పువ్వుల మొక్కలే! ఆ ఎత్తైన ప్రహరీ గోడని అనుకొని లోపల అన్నీ గులాబీ, మల్లె, చేమంతి మొక్కలే. పెద్దగేటు తీసుకుని లోపలికి వెళ్ళినప్పుడు తను ఎన్ని మాట్లు చూసింది కాదూ. పందిరినిండా జాజి, విరజాజి తెల్లగా విచ్చుకొని నవ్వుతూ ఉండడం? మల్లెలూ గులాబీలూ సరేసరి! ఆకులు కనిపించకుండా చెట్టునిండా ఎప్పుడు చూసినా విరగబూసి ఉంటాయి. అన్ని పువ్వులు తమ దొడ్లో ఉండగా, మళ్ళీ తన దగ్గర, వాళ్ళు పువ్వు లెందుకు కొంటారబ్బా?

అది అర్థంకాకే అమ్మ నెన్నోమార్లు అడిగింది. "డబ్బున్న వాళ్ళంతేనమ్మా, వాళ్ళ తోటలో పువ్వులు కోసు కోరు. అందం కోసం అలా అట్టే పెట్టేసుకుంటారు రాలి

పోతున్నా సరే. అవసరం అయితే ఇలాగే మన దగ్గరా మన దగ్గరా కొనుక్కుంటుంటారు" అని అమ్మ చెప్పినా, తనకి అందులో ఒక్కమాట కూడా అర్థం కాలేదు.

పైగా వాళ్ళు కొనేవి కాస్తా కూస్తానా? ఒక్కొక్కప్పుడు బుట్టలో ఎన్ని మిగిలితే అన్నీ కొనేస్తారు. అవి వెయ్యికానీ, రెండువేలుకానీ ఇలాంటి ఇంటికి వెళితే పువ్వులన్నీ ఒక్క నిముషంలో అమ్ముడయి పోతాయి. పెందరాళే ఇంటికి వెళ్ళొచ్చు, రంగంనుంచి రంగడు కూడా వొస్తాడట ఇయాల.

అయితే, ఆ మేడింటికి వెళ్ళాలంటే తనకి ఇష్టం ఉండదు. మొదటిదితను ఎంతసేపు నిలబడి ఉండాలో. పిలిచాక గంటయినా వాళ్ళు మేడదిగి కిందికిరారు. అందాకా కాళ్ళడి పోయేలా నిలబడి ఉండాల్సిందే. పువ్వులు పట్టుకుని మేడమీదికి ఎల్లిపోయి మరో గంటదాకా డబ్బు లియ్యరు. ఆ ఇయ్యడమైనా ఎలా అని? మేడ మీంచి కింద పడెయ్యడమే! నేల మీద పడిన డబ్బులన్నీ తను జాగ్రత్తగా ఏరుకోవడమే! అలా ఏరుకోవడమంటే తనకి బలే చిరాకు. అంతే కాకుండా ఆ యింట్లో బొచ్చుకుక్క ఒకటి! గేటు తొయ్యడం తరవాయి. రాక్షసిలావచ్చి మీద పడుతుంది! దాన్ని కట్టేసి ఉంచరు ఆదేం కర్మమో. అది ఎవరిమీదైనా పడి కరవబోతే, వాళ్ళు మేడమీంచి చూసి నవ్వడం కూడాను. ఇవతలి వాళ్ళు హడలిచస్తూంటే, అన్నిటి కంటే ఆ ఇంటి యజమాని చూపులు! తళతళలాడే బూట్లూ ఖరీదైన బట్టలూ, రంగుటద్దాల కళ్ళ

జోడూ, వీటితో అతను కారుదిగి లోపలికి వెళుతూ అప్పు డప్పుడూ తనకేసి ఎలా చూస్తాడని? ఆ చూపులు తలుచుకుంటే భయంతో తనకి ఇప్పుడుకూడా వొళ్ళంతా వొణికిపోతుంది.

"అందుకే బాబూ ఆ ఇంటికి వెళ్ళకుండా వెనక్కి వెళ్ళి పోదాం" అని పించింది రంగికి. కాని యిన్ని పువ్వులు అమ్మడు పోవాలంటే, తను పెందరాళే యింటికి వెళ్ళి పోవాలంటే ఆయింటికి వెళ్ళడమే మంచిది.

ఈ పాటికి రంగం నుంచి రంగడు వొచ్చి ఉంటాడు.

మనస్సులో ఏదో తియ్యని భావం జివ్వుమన్న ట్లయింది. సంతోషంతో గుండె బరువెక్కి గుబులుగా అని పించింది. రంగి గబగబా "మేడ దగ్గిరికి వెళ్ళి ఇనప గేటు తోసింది. కిర్రు మంటూ అది పెద్దపులి నోరులా తెరుచుకుంది. కొంప మునిగిపోయినట్లు అరుచుకుంటూ బొచ్చుకుక్క పరిగెట్టుకుని వచ్చింది. దాని వెనకాలే, ఆయింటి యజమాని గేటు పక్క గదిలోంచి ఇవతలికి వచ్చి, కుక్కని అదిలించి లోపలికి పంపేసి రంగి కేసి విలాసంగాచూశాడు. ఆ చూపులు రంగి ఒళ్ళంతా ముళ్ళలా గుచ్చుకొన్నాయి.

గుండెమీద ఉన్న పైట నిండుగా కప్పుకుంటూ "అమ్మగారూ!" అంటూ పిలిచింది రంగి మేడ మీంచి ఇందాకా కేకేసిన ఆ అందమైన యువతి కోసం. ఆవిడ దగ్గర్నుంచి సమాధానం రాలేదు కాని ఆయువకుడు మాత్రం

వికటంగా పెద్ద నవ్వు నవ్వి "అమ్మగారెందుకు? ఆవిడ మేడ దిగదు. నేనున్నానుగా?" అంటూ సాభిప్రాయంగా రంగికేసి చూశాడు. అతని చూపు చూస్తే రంగికి భయం, అసహ్యం రెండూ ఒక్కామారు వేశాయి.

"అమ్మగారు పిలిచారు" అంది రంగి

"ఆ పిలిచింది నా కోసమేలే" అంటూ చటుక్కున రంగి జబ్బ పట్టుకొని ఆ యువకుడు రంగిని పక్క గదిలోకి లాగేశాడు. ఒక్క ఉదుటున రంగి నెత్తిమీద ఉన్న బుట్ట పడిపోయి మల్లెపువ్వులన్నీ ఆ గచ్చు వాకిట్లో చెల్లా చెదరై పోయాయి.

అరవబోయిన రంగి నోరు ఓచేత్తో మూస్తూ మరోచేత్తో గదిలోపలవున్న గడియ వేసేశాడు ఆ యువకుడు. అతని కళ్ళు ఆకలితో ఉన్న తోడేలు కళ్ళలా భయంకరంగా ఉన్నాయి. రంగిని ఆక్రమించుకోబోతున్న యువకుడు నిప్పులకొండలా కనిపించాడు ఆమెకి.

రంగి చూపులు లేడి చూపుల్లా బెదురుతున్నాయి.

ఆమె గుండెలు భయంగా అదురుతున్నాయి.

"ఇదిగో నువ్వు ఎలాగా తప్పించుకో లేవు. నిన్ను రక్షించే వాళ్ళూ లేరు ఇక్కడ. అందువల్ల నువ్వు మనస్ఫూర్తిగా ఒప్పుకో - అందుకు నీకు కావలసినంత డబ్బు ఇస్తాను

తీసుకో" అంటూ రంగి కాళ్ళ దగ్గరికి పర్సు విసిరాడు. పర్సులోంచి ఇవతలపడ్డ రంగురంగుల నోట్లు రంగికళ్ళకి రంగురంగుల పాముల్లా, విషనాగుల్లా కనిపించాయి. భయంతో కెవ్వున అరిచింది రంగి. నేలమీద వాలిపోతున్న రంగి శరీరాన్ని సులభంగానే స్వాధీనం చేసుకున్నాడు ఆ యువకుడు........

రంగి నీరసంగా కళ్ళు విప్పి చూసేసరికి జుట్టు చెదిరి పోయి ఉంది. రవిక పిగిలిపోయి ఉంది. కట్టుకున్న బట్టలు కకావికలై ఉన్నాయి. గోడని ఉన్న అద్దం, వాడిన రంగి ముఖాన్ని చూపించింది.

గుండెలు మండిపోతున్నాయి. మెదడులో సమ్మెట దెబ్బలు. లేవలేనంత నీరసం. శరీరం అంతా విపరీతమైన నెప్పులు. లేవలేక గోడని చెయ్యి ఆన్చుకొని లేచింది. తల తిరిగిపోతోంది. కాళ్లు తేలి పోతున్నాయి. గది దాటి బయటికి వచ్చింది రంగి.

గచ్చు వాకిట్లో నలిగి వాడిపోయిన మల్లెపూలు!

నేలమీద దొర్లుతూన్న ఖాళీ మల్లెగంప!

పై మేడమీంచి ఇందాకటి అందమైన యువతి నిస్సహాయమైన చూపులు! కన్నీళ్ళతో కూడిన వేడి నిట్టూర్పులు.

పక్క గదిలో అలిసిపోయిన ఆంబోతులా బుసలు కొడుతూన్న ఆ యువకుడు.

రంగి అశుభం శుభం తెలియని చిన్న పిల్ల. శక్తి లేని నిస్సహాయురాలు!

చుట్టూదట్టంగా పరుచుకుంటూన్న చీకట్లు.

ఉండుండి ఉరుములూ మెరుపులతో వాన.

ఆ వానలో సుడిగాలిలా పడుతూలేస్తూ శోకదేవతలా రంగి ఎలాగోలాగ ఏటి ఒడ్డుకి జేరుకొంది.

కాని అప్పటికే ఏరుపొంగి కట్టలు తెంచుకొని, సుళ్ళు తిరుగుతూ, పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది.

దోనెని అవతల ఒడ్డున కట్టేసి తాత వెళ్ళిపోయాడు.

భయంకరంగా గాలి వీస్తోంది. అడ్డూ ఆపూలేకుండా వాన కురుస్తోంది. ఒడ్డుల్ని ఒరుసుకొని ఏరు పొంగి మహా వేగంతో ప్రవహిస్తోంది.

కన్ను పొడుచుకున్నా కనిపించని చీకట్లో ఇవతలి ఒడ్డునపడి "అమ్మో ఏరు పొంగింది. ఎలా ఆ ఒడ్డుకి రావడం!" అంటూ గుండెలు పగిలేలా ఏడుస్తోంది రంగి.

అవతలి ఒడ్డున "రంగీ!.... నా తల్లీ!.... ఏమై పోయావే?.... రంగం నుంచీ నీ కోసం రంగడొచ్చాడే"

అంటూ పిచ్చిగా అరుచుకుంటూ లచ్చి దిక్కుతోచక అటూ ఇటూ పరిగెడుతోంది.

ఇటునుంచి గుండె కరిగిపోయేలా రంగి ఏడుపు.

అటునుంచి నెత్తీ నోరూ బాదుకుంటూ లచ్చి అరుపు.

ఆ గాలిలో, వాన హోరులో, భయంకరంగా ప్రవహిస్తూన్న ఏటి రొదలో వాళ్ళ ఒకరి ఏడుపు మరొకరికి వినిపించలేదు. ఆ ప్రళయరాత్రి అంతా గడిచి తెల్లవారేసరికి ఈ గట్టున రంగి లేదు. ఆ గట్టున లచ్చీ కనిపించలేదు. ఇద్దర్నీ ప్రవాహం ఎక్కడికి చేర్చిందో ఎవరికీ తెలియదు. అయితే ఈ రోజుకి కూడా గుండెని కోసేస్తూ రంగి కంఠం మాత్రం ఏటి ఒడ్డున అప్పుడప్పుడూ రాత్రిళ్ళు వినిపిస్తూనే ఉంటుంది.

"అమ్మా - ఏరుపొంగిందే!" అంటూ.

( ఆంధ్రజ్యోతి )